# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## రాజుల సొమ్ము ..

# రాళ్ళ పాలు...

- ఎన్ఆర్ఈజీఎస్ నిధులు పక్కదారి
- పనులు చేయకుండానే బిల్లులు డ్రా
- సోషల్ అడిట్‌లో బయటపడిన బాగోతం
- సంబంధంలేని వ్యక్తుల పేర్లపై బిల్లులు ఎట్లా డ్రా చేస్తారు






గ్రామానికి సంబంధం లేని వ్యక్తి పేరిట డబ్బులు డ్రా చేసిన స్టేట్‌మెంట్

**వంగూరు, జూలై 21 ప్రభాతవార్త:** జాతీయ ఉపాధి హామీ పథకం కింద పేద ప్రజల జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం పనులు కలి పిస్తుంటే కొందరు అక్రమార్కులు ప్రజలతో పనులను నిర్వహించకుం డానే ఆ గ్రామానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లపై బిల్లులు డ్రా చేసి జాతీయ ఉపాధి హామీ నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. ఎన్ఆర్ఈజీ ఎస్ పథకంలో ట్రాక్టర్ వర్క్స్ కింద, నర్సరీల నిర్వహణ, ట్రాక్టర్ల నిర్వహణకు డీజిల్, రహదారుల వెంట నాటిన మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఈ నిధులను ఉపయోగించాలని ప్రభుత్వ నిబంధనలు. నిబంధనలను ఉల్లంఘించి పనులు చేయకపోయినా చేసినట్లు సృష్టించి రూ.1లక్ష 80 వేల రూపాయలను ఇద్దరు వ్యక్తుల పేర్లపై వంగూరు మండల కేంద్రం లోని ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకులో డ్రాచేసిన వైనం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... వంగూరు మండలం కోనేటిపూర్ గ్రామంలో గత సంవత్సరం మార్చి 31 నుండి జూలై 18 2025 వరకు నిర్వహించిన జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.1 లక్ష 80 వేల రూపాయలు పక్కదారి పట్టినట్లు ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీలో బయట పడ్డాయి. ఈ నిధులు అక్టోబర్ 1, 2024 నాడు ఫీల్డ్ అసిస్టెంట్ తోట వెంకటయ్య పేరు మీద చెక్ నెంబరు.ఐబి113205 ద్వారా రూ.1లక్ష రూపాయలు,వంగూరు మండల కేంద్రానికి చెందిన తిప్పారెడ్డిపల్లి స్వప్న పేరు మీద చెక్ నెంబరు.ఐబి105288 ద్వారా 80వేల రూపాయల నిధులను డ్రా చేసినట్లు తేటతెల్లమైంది. వంగూరు మండల కేంద్రానికి చెందిన వ్యక్తిపై రూ.80 వేల రూపాయల చెక్కు రావడమేమిటని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. డ్రా చేసిన నిధులకు ఎలాంటి రికార్డులు లేకపోవ డంతో ప్రస్తుత గ్రామ కార్యదర్శి తిరుపతయ్యపై సామాజిక తనిఖీకి వచ్చిన డిఆర్‌డిప కోపోగ్రస్తులై – మిగతా4లో..

## బాలుడిని మింగిన ఇసుక గుంత

- దుందుభిలో పడి మృతి
- మిడ్జిల్ మండలం వల్లభురావుపల్లిలో ఘటన



బాలుడి పార్థీవదేహం

**జడ్చర్ల,మిడ్జిల్, జూలై21,ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల కొరకు దుందుభినదిలో తీసిన ఇసుక గుంత ఓ బాలుడి ప్రాణాలను తీసింది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామం మీదుగా వెళ్తున్న దుందుభి వాగు పారింది. దీంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి దుందుభీ వాగు నుంచి ఇసుక తరలించగా గుంతలు ఏర్పడడంతో నీరు నిల్వ ఉన్నాయి. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా బోనాల పండుగ సందర్భంగా పాఠశాలలకు సెలవు ఉండడంతో సోమవారం మిడ్జిల్ మండలం వల్లభురావు పల్లి గ్రామానికి చెందిన జక్క సాయి (10)తన అన్నతో పాటు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి దుందుభివాగులో గుంతలో ఉన్న నీటిలో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. ఈ క్రమంలోనే సాయి ఆ నీటిలోకి దూకి బయటికి రాలేదు. ఇది గమనించిన సాయి అన్నతో పాటు స్నేహితులు ఆందోళనతో వాగు పరివాహక ప్రాంతంలో ఉన్న రైతులకు సమాచారం ఇవ్వగా రైతులు వచ్చి గుంతలోల నుండి బాలుని వెతికి బయటకు తీశారు. అప్పటికే సాయి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు జక్కా రఘు, యాదమ్మ వాగులోని ఘటన స్థలానికి చేరుకొని కుమారుడిని చూసి బోరున విలపించారు. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## జూరాలకు స్వల్పంగా తగ్గిన వరద

**- 8గేట్లు ఎత్తి నీటి విడుదల,- జలాశయానికి 72,000 ఇన్‌ఫ్లో**



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 21, ప్రభాతవార్త :** జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం పెరుగుతున్నది. కర్ణాటక నుంచి భారీ గా వరద ప్రవాహం నమోదు కావడంతో జూరాలకు జలకళను సంతరించుకున్నది. జలాశయానికి 72,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 3.956 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 31,806 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 31,464 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1030 క్యూసెక్కులు, కుడి కాలువకు 600 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 67,001 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

## మహిళల ఆర్థిక అభ్యున్నతికి

# బలమైన పునాది

- మహిళల ఆత్మవిశ్వాసమే సమాజ పురోగతికి మూలం..
- మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యం..
- అట్టహాసంగా ఇందిరా మహిళా శక్తి సంబురాలు
- రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

**అచ్చంపేట,జూలై 21 ప్రభాతవార్త:**మహిళల ఆత్మవిశ్వాసమే సమాజం పురోగతికి మూలము అని, అందుకు అనుగుణంగానే మహిళాలు ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం బలమైన పునాది వేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఇందిరా మహిళా శక్తి సంబురాలు మరియు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హజరై మాట్లాడుతూ మహిళలందరూ కోటీశ్వరులుగా మారడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని మంత్రి తెలిపారు. మహిళల అభ్యున్నతి, ఆత్మవిశ్వాసమే తెలంగాణ రాష్ట్రానికి బలమైన పునాదిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని తెలిపారు.



మహిళలకు నేడు అన్ని రంగాల్లోనూ ప్రోత్సాహాన్ని, అవకాశా లను కల్పిస్తుందని ప్రభుత్వం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా సంక్షేమ పథకాల వివరాలు ఈ సందర్భంగా మంత్రి తెలియజేశారు. స్వయం ఉపాధికి తగిన ప్రోత్సాహం, స్వయం సహా యక సంఘాల పెంపుదల, విద్య, ఆరోగ్యం వంటి అంశాలను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.



అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ 1992 సంవత్సరంలో అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం డ్వాక్రా పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగు పథకంగా నామకరణం చేసి దాన్ని కొనసాగించాలని, 2004 నుండి 2014 వరకు ఐకేపీగా నామకరణం చేసి మహిళల అభ్యున్నతికి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి కృషి చేశారని ఎమ్మెల్యే వంశీకృష్ణ కొనియాడారు. 2014 నుండి 2023 వరకు గత ప్రభుత్వం హయాంలో మహిళల సంక్షేమం పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆయన చెప్పారు. ఇప్పుడు ఇందిరమ్మ ప్రభుత్వం నల్లమల్ల ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అందులో భాగంగానే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 500 రూపాయలకు వంట గ్యాస్, గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును, మహిళల పేర్లు పైన ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందని చెప్పారు. 3629 మంది స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలను అందించినట్లు తెలిపారు. అంతకు ముందు మంత్రి మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

## రైతులకు సకాలంలో విత్తనాలు,

# యూరియా అందుబాటులో ఉంచాలి

### - సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 21 ప్రభాతవార్త:** నీటిపారుదల ప్రాజెక్టుల నీటి విడుదల, కాలానుగుణంగా వ్యవసాయం పనులు విత్తనాలు యూరియా వంటి సరఫరా రైతుల కు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ పనులు, వర్షాకాలంలో వచ్చే అంటూ వ్యాధులు ఇతర వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించడం, జిల్లాల్లో అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ, రుతుపవనాలు, వానాకాలం పంటల సాగు ఇతర అంశాలపై ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల కలెక్టర్లతో చర్చించి పలు అంశాలపై ఆదేశాలు జారీచేశారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి నీటిపారుదల, వ్యవ సాయం,భారీ వర్షాలు,ఆరోగ్యం,రేషన్ కార్డుల పంపిణీ, తదితర అంశాలపై, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్ నుంచి మంత్రులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర్‌రాజనర్సింహ, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర ప్రభుత్వ



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్సు హాల్ నుండి అదనపు కలెక్టర్ అమరేందర్, నీటి పారుదల సీఈ విజయ్ భాస్కర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయనికి కాకుండా ఇతర అవసరాలకోసం దారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, ఎరువుల మీద ఫిర్యాదులు చేయడానికి టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారు. అదిలాబాద్ నుండి అచ్చంపేట వరకు ఏ ఒక్క రై తుకు వ్యవసాయ పనులకు ఇబ్బంది కలుగకుండా క్షేత్రస్థాయిలో కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్ల ను ఆదేశించారు. 3కోట్ల 10 లక్షల మందికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నాం, కొత్త రేషన్ కార్డు, అలాగే మార్పులు, చేర్పులు పూర్తి స్థాయిలో జరగాలి, ఈ నెల 25 నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాలలో రేషన్ కార్డులను పంపిణి చేయాలి, ప్రతీ మండలంకు ఒక అధికారిని పెట్టి.. రేషన్ కార్డులు ఎన్ని ఇస్తున్నారు తదితర విషయాలు ప్రజలకు తెలియజేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారు. రేషన్ కార్డు పంపిణి నిరంతర ప్రక్రియ, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని, వర్షాల వల్ల ప్రజలకు ఏ మాత్రం ఇబ్బంది కలుగకూడదని, సీజనల్ వ్యాధులు డెంగ్యూ,చికెన్‌గున్యా,మలేరియా, వైరల్ ఫీవర్ రాకుండా తగు చర్యలు –మిగతా4లో..

## జూరాల డ్యాంపై ప్రమాదం

### నదిలో పడ్డ యువకుడు గల్లంతు



గల్లైంతన మహేష్, గాయాలపాలైన జానకి రాములు,పోలీసులు అదుపులోకి తీసుకున్న కారు

**గద్వాల టౌన్, జూలై 21, ప్రభాతవార్త:** జూరాల డ్యామ్ వద్ద ఆదివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. డ్యాంపై కారు,ద్విచక్ర వాహనం ఢీ కొన్న ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు అయ్యాయి. అదేసమయంలో మరొక ఇద్దరు అక్కడే వుండగా ప్రమాద సమయంలో తమపైకి కారు దూసుకురావడంతో ఒక యువకుడు ప్రాణభయంతో డ్యామ్‌లోకి దూకి గల్లంతయ్యాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడగా, ఇద్దరు యువకులు మాత్రం ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు.వివరాల్లోకి వెళితే.... మానవపాడు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన మహేష్ (21), జానకిరాములు, ఇంకా ఇద్దరు స్నేహితులు కలిసి జూరాల డ్యామ్ సందర్శనకు వచ్చారు. రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో వారు డ్యామ్ బ్రిడ్జిపై నుంచి గద్వాల వైపు వెళ్తుండగా, కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి డ్రైవింగ్ చేస్తున్న కారు అజాగ్రత్తగా, సెల్‌ఫోన్ చూస్తూ మోటారు సైకిళ్లను ఢీకొట్టేందుకు దూసుకరాగా ప్రమాదం నుంచి తప్పించుకునే ప్రయత్నంలో మహేష్ డ్యామ్‌లో పడిపోయి గల్లంతయ్యాడు. జానకిరాములు తీవ్రంగా గాయపడ్డాడు. మిగతా ఇద్దరు యువకులు దూరంగా ఉండడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. గాయపడిన యువకుడిని హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు.ఈ ప్రమాదంతో డ్యామ్ పరిసరాల్లో అలజడి నెలకొంది. గల్లంతైన మహేష్ కోసం జూరాల ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది, ధరూర్ పోలీసులు కలిసి గాలింపు చర్యలు చేపట్టారు.

# జూలై 25 నుంచి రేషన్ కార్డుల పంపిణీ

- ఎరువుల వివరాలు ప్రతిరోజు నమోదు చేయాలి
- వర్షాకాలంలో వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్‌లు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

హాజరైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌లు

**మహబూబ్‌నగర్ బ్యూరో,నారాయణపేట ప్రతినిధి,వనపర్తి ప్రతినిధి,గద్వాలటౌన్, జూలై 21 ప్రభాతవార్త:** జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు మండల కేంద్రాలలో రేషన్ కార్డుల పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్ కార్డుల పంపిణీ వంటి పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి , పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, సీతక్క, శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి జిల్లాకలెక్టర్‌లు విజయేందిర బోయి,సిక్తా పట్నాయక్, ఆదర్శ సురభి,బి.యం. సంతోష్ పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఖమ్మం జిల్లాలో మూడు గంటల వ్యవధిలో 39 సెంటీ మీటర్ల భారీ వర్షం పడిందని, ప్రస్తుతం కూడా అటువంటి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ కలెక్టర్‌లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ సాగు పనులు సజావుగా జరిగేందుకు అవసరమైన ఎరువులు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం, నీటిపారుదల శాఖ ద్వారా రైతులకు సాగునీరు విడుదలపై కలెక్టర్ దృష్టి సారించాలని అన్నారు. జూలై 21 వరకు మన రాష్ట్రంలో దాదాపు 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని, గత 3 రోజులుగా వర్షాలు ఎక్కువ కురుస్తు న్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను అప్రమత్తం చేయాలని, జిహెచ్ఎంసి పరిధిలో హైదరా ఆధ్వర్యంలో




వీసీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

150 బృందాలను సిద్ధం చేశామని అన్నారు. నగరంలో వర్షాలు ఉన్నప్పుడు ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాకాలంలో వచ్చే అంటు రోగాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ముఖ్యంగా ఐటీడీఏ గిరిజన ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని అన్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి వరకు వైద్యులు సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా పరిధిలో ఉన్న ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు అధికంగా నిర్వహించాలని, ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేసి పనితీరు పర్యవేక్షించాలని అన్నారు. అత్యవసర సమయంలో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు నిధులు కూడా అందుబాటులో పెట్టడం జరుగుతుందని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మన ప్రాజెక్టులలో నీరు నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సంవత్సరం మన రాష్ట్రంలో దేశంలోనే అత్యధికంగా రెండు కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వారి ఉత్పత్తి చేశామని అన్నారు. గోదావరి బేసిన్‌లో ప్రాజెక్టులలో నీరు తక్కువగా ఉందని, ఇక్కడ నీరు వృధాగా పోకుండా ప్రాజెక్టులలో ఎప్పటికప్పుడు నింపాలని అన్నారు. వ్యవసాయశాఖ అధికారులు నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా అందుబాటులో ఉండాలని అన్నారు. విత్తనాల,ఎరువులు అక్రమ స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలి విత్తనాల అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో ఎరువుల స్టాక్ ఎంత అందుబాటులో ఉందో కలెక్టర్ రెగ్యులర్‌గా ప్రకటనలు విడుదల చేయాలని, ప్రతి ఎరువుల షాప్ వద్ద స్టాక్ వివరాలు నోటీసు బోర్డులు పెట్టాలని, ఇద్దరూ పోలీస్ అధికారులను నియంత్రణకు పెట్టాలని అన్నారు. ఎరువుల లభ్యతపై అసత్య ప్రచారాలను గట్టిగా తిప్పి కొట్టాలని సీఎం పేర్కొన్నారు. రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతులు ముందస్తుగా ఎరువుల స్టాక్ పెట్టుకోకుండా అవగాహన కలిగించాలని అన్నారు. 20 నుంచి 25 శాతం ఎరువులు వ్యవసాయ అవసరాల కోసం కాకుండా ఇతర అంశాలకు, డీజిల్ వాహానాలలో పొగ తగ్గించేందుకు సబ్సిడీ ఎరువులు వినియోగిస్తున్నట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారని సీఎం అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒకచోట ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ఒక చోట పాల్గొనేలా కలెక్టర్ కో ఆర్డినేట్ చేసుకోవాలని సీఎం తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్డిఓ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.నర్సింహా రెడ్డి, డిఎంహెచ్ఓ కె.కృ ష్ణ జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, సిపిఓ రవీందర్ ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.











విసికి హాజరైన మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి, వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి ,నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ , బిఎం సంతోష్ ,ఉమ్మడి జిల్లాల అధికారులు

## సకాలంలో వర్షాలు కురవాలని అఖండ జ్యోతి సప్తహభజన

**మల్దకల్, జూలై 21, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అఖండ జ్యోతిసప్త భజన కార్యక్రమం మూడో రోజు సోమవారం కొనసాగుతున్నది.వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రతి సంవత్సరం ఆషాడంలో చివరన ప్రారంభమై శ్రావణమాసంలో ఈ సప్తహ భజన కార్యక్రమం జరుగుతుంది.శ్రీ గిరీశాచల యోగీశ్వర భజన కళాకారుల సమితి అధ్యక్షుడు ప్రసాద్ చారి,ప్రముఖ హార్మోనిస్టు పచ్చర్ల రాఘవేంద్ర చారి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. సంకాపురం తిమ్మప్ప, పర్దేపురంసోమన్న, వెంకటేశ్వర్లు,యు గోపాల్, వడ్డేపల్లి రాజు,ఓంకార్, రామాంజనేయులు, మల్దకల్ భజన మండలి,భక్తాదులు,భక్తి పాటలతో భజన జరుగుతుంది.ఈ కార్యక్ర మంలో ఆలయ వంశీయులు పట్వారి ప్రహ్లాద రావు,ఈవో సత్య చంద్రారెడ్డి, అరవింద రావు, చంద్రశేఖర రావు, అర్చకులు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.సప్తహ భజన భక్తాదులకు అరిగిద్ద గ్రామానికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ రాముడుఅన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.



దేవాలయంలో అఖండ జ్యోతిసప్త భజన కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీ గిరీశాచల యోగీశ్వర భజన కళాకారులు

## ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

**ఆత్మకూర్ జూలై 21, ప్రభాతవార్త;** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున కరిగే 84వ జన్మదిన వేడుకలను మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహావరణలో జన్మదిన వేడుకలు పురస్కరించుకొని ప్రత్యేకంగా తయారు చేసిన కేక్ కట్ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షులు పరమేష్ మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మల్లికార్జున కరిగే జన్మదిన వేడుకలను జరుపుకోవడం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గర్వించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసిరాజు యాదవ్, నల్లగొండ శ్రీనివాసులు, గాలి పంపు శ్రీనివాసులు, మనివర్ధన్ రెడ్డి, నాగేష్, దామోదర్, అశోక్, ముదిరాజ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గణేష్, తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కరిగే జన్మదిన వేడుకలు పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న దృశ్యం

## పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సబావత్ లక్ష్మి

**- మృతి పట్ల పలువురి సంతాపం**

**- సంతాపం తెల్పిన సింగిల్ విండో చైర్మన్,మున్సిపల్ మాజీ చైర్మన్**

**భూత్పూర్,జూలై 21,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం భట్టుపల్లి ఏవీఆర్ కాలనీకి చెందిన సింగిల్ విండో మాజీ డైరెక్టర్ సబావత్ లక్ష్మి ఆదివారం రాత్రి మరణించగా, విషయం తెల్సుకున్న పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆమె మృతిపట్ల సంతాపం తెలిపారు.సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డితో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, మాజీ సర్పంచి సత్తూర్ నారాయణ గౌడ్,మాజీ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మేకల సత్యనారాయణ,జిల్లా మత్స్యకార సంఘం మాజీ చైర్మన్ మనెమోని సత్యనారాయణ,మాజీ సర్పంచి సబావత్ అంజనేయులు నాయక్ నాయకులు ఆల శ్రీకాంత్‌రెడ్డి, కరివెన బాల్‌రెడ్డి,సబావత్ దశరథ్ నాయక్,సబావత్ జైపాల్ నాయక్,రాము నాయక్,గోపాల్ నాయక్ తదితరులు నివాళులర్పించినవారిలో ఉన్నారు.



లక్ష్మి పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

## ఘనంగా మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు

**అమరచింత,జూలై 21, ప్రభాతవార్త:** ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు.ఈసందర్భంగా కాం గ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు, అరుణ్ కుమార్, కేజీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కో సం అహర్నిశలు కృషి చేస్తుందని వారు అన్నారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలనే ఆకాంక్షతో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మల్లికార్జున్ కార్గే ఎనలేని కృషి చేస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు, మహంకాళి విష్ణు, తిరుమలేష్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, ఏకే వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు, విష్ణు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు, హనుమంతు నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు, ప్రకాశం సోషల్ మీడియా కోఆర్డినేటర్, తౌఫిక్, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు, హరీష్ నాయక్, ఐఎన్టీయూసీ అధ్యక్షులు ప్రభుదాస్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షులు, శ్యాం కుమార్, కాంగ్రెస్ నాయకులు, సత్య రెడ్డి, విజయ్, వీరేష్ గౌడ్, జానిస్ట్, దేవరాజు, తిరుపతి రవి రాములు శరత్ సోమల నాయక్ సుధాకర్ యోబు సవరణ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు

## మైనారిటీస్ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

**నారాయణపేట ప్రతినిధి, జూలై 21 ప్రభాతవార్త:** తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ద్వార బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ సెక్టార్లో మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ, ఉపాధి కార్యక్రమాన్ని అందిస్తుందని జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి ఎంఏ రషీద్ తెలిపారు.హైదరాబాద్‌లో ఒకనెలపాటు నిర్వహించబడుతుందన్నారు.అర్హత కలిగిన మైనారిటీ అభ్యర్థులు (ముస్లిములు,క్రైస్తవులు,సిక్కులు, జైనులు, పారసీలు మరియు బౌద్ధులు) ఈ నెల 18 నుండి 18ఆగస్టువరకు దరఖాస్తు చేసుకోగలరన్నారు.50శాతం మార్కులతో 26ఏళ్లకంటే తక్కువ ఉండాలి. అభ్యర్థి ఏదేని సబ్జెక్టులో గ్రాడ్యుయేట్/ పోస్ట్ గ్రాడ్యుయేట్ అయి ఉండాలన్నారు. జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ కార్యాలయాము, కలెక్టరేట్ కాంప్లెక్స్ నారాయణపేటలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కొరకు 040-23236112 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## వసతిగృహాలను ప్రారంభించిన రాజ్ కుమార్ రెడ్డి

**దామరగిద్ద, జూలై 21 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లి గ్రామంలోని శ్రీ వీరభద్రేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన వసతిగృహాలను భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్‌రెడ్డి సోమవారం ముఖ్య అతిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్‌రెడ్డికి, ఫౌండేషన్ సభ్యులకు దేవాలయ నిర్వాహకులు, పురోహితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం దేవాలయ ఆవరణలో హోమాన్ని చేపట్టారు. దాతల సహకారంతో నిర్మించిన వసతిగృహాలను దేవాలయ నిర్వాహకులు, దాతలతో కలిసి రాజ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. రాజ్ కుమార్ రెడ్డిని దేవాలయ నిర్వాహకులు, దాతలు శాలువలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు నారాయణ, ఉపాధ్యక్షులు బసంత్ రాజ్ పటేల్, కోడ్లీ శరణప్ప, బసిరెడ్డి, మోహన్ రెడ్డి, గంగాధర్, పురోహితులు శివకుమార్, శరణయ్య, గణేష్, చెన్ను, ఫౌండేషన్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, హన్మంతు ముదిరాజ్, చల్లా వెంకటేష్, నర్సింహనాయుడు, ఎం.సంతోష్, నందుకుమార్, వై.సంతోష్, నర్సింహ, శ్రీనివాస్, అశోక్, మన్నె గోపాల్, ప్రవీణ్, విజయ్, రాజు, దాతలు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వసతి గృహాలను ప్రారంభిస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

# మామిళ్ళపల్లి ఆలయ అభివృద్ధికి కృషి

### టీ పీసీసీ ఉపాధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, జూలై 21 ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వనమహోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిమగల శ్రీ లక్ష్మినరసింహస్వామి నియోజకవర్గంలోని అతిపెద్ద ఆలయం అని ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని, త్వరలోనే అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఆలయ అభివృద్ధికి గ్రామంతో పాటు మండల ప్రజలు సహకరించాలని సూచించారు. అన్యాక్రాంతమైన ఆలయ భూముల పరిరక్షణ తమ లక్ష్యమని, ఆలయానికి సంబంధించిన ఆస్తులు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత పాలకుల వైఫల్యంతోనే మామిళ్ళపల్లి లక్ష్మినరసింహస్వామి ఆదరణ కోల్పోయిందని, ఆలయానికి సంబంధించిన సెంటు భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపైన ఉందని, ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలు కనివిని ఎరుగని రీతిలో జరిగే విధంగా ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో కలియతిరిగారు మహిళలతో కొంతసేపు ముచ్చటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో పావలా వడ్డీ తదితర సంక్షేమ పథకాలు చేపట్టడం జరుగుతుందని మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు, నాగర కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పాటు అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణా నర్సింహారెడ్డి, మామిళ్ళపల్లి ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, ఓబీసీ సెల్ నియోజకవర్గ గిరివర్ధన్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కాల్వ గోవర్ధన్ రెడ్డి, ఉప్పరిపల్లి మాజీ సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాల్‌రావు, పానం సైదులు,సామ వెంకటేష్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అడుపాల గోపాల్ రెడ్డి, బలమూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్ రెడ్డి వెంకటరెడ్డి, ఉప్పునుంతల రాయల్ ఫిల్లింగ్ స్టేషన్ యజమాని ఎడ్ల నరేష్‌యాదవ్,ఈవో నరసింహులు, మామిళ్ళపల్లి మాజీ ఉపసర్పంచ్ మోహన్ గౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెల్టూరి రేణయ్య,ఆలయ కమిటీ డైరెక్టర్లు ఎలుక స్వరూప సుదర్శన్ రెడ్డి, చలమల గణేష్ గౌడ్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ఉమాపతి చారి, అచ్చంపేట ఆర్యవైశ్య సంఘం సభ్యులు కన్నయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మామిళ్ళపల్లి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

# భవిష్యత్‌లో బీఆర్ఎస్‌దే అధికారం

### స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి : బాసు హనుమంతు నాయుడు

**గద్వాలటౌన్,జూలై 21, ప్రభాతవార్త:** తెలంగాణలో రాబోయే భవ్యత్తులో అధికారంలోకి వచ్చేది బిఆర్‌యస్ పార్టీ అని, స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలని గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు అన్నారు. గట్టు మండలం మిట్టదొడ్డి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైబాసు హనుమంతు మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు బిఆర్ యస్ పార్టీకే అధికారం కట్టబెడుతారని, స్థానిక సంస్థల ఎన్నికలకు బిఆర్ యస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.420 వాగ్దానాలు చెప్పి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని విమర్శించారు.రుణమాఫీ పేరిట ప్రభుత్వం రైతులను మోసంచేసిందన్నారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలలో ఏమీ అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. ఈ జిమ్మిక్కులను ప్రజలు తగిన బుద్ధి చెబుతారనీ, ప్రజలు కేసీఆర్‌నే సీఎంగా కోరుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికలు ముందున్న నేపథ్యంలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెల్లి బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం హనుమంతునాయుడు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్‌నాయకులు బిఆర్‌యస్‌పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరెడ్డి,మోనేష్,రాజారెడ్డి,కోమటి నాగరాజు శెట్టి,ఎస్.రాము నాయుడు,సోమశేఖర్ రెడ్డి, శేఖర్ నాయుడు,జయసింహ రెడ్డి,బాసు గోపాల్,నూర్ పాషా,కిష్టప్ప,రాయపురం వీరేష్ నాయుడు, మద్దిలేటి,వెంకటేష్ నాయుడు,తిమ్మప్ప గౌడ్,జాంపల్లి భరత్ సింహారెడ్డి, బాసు బొజయ్య, తెల్లయ్య,కోటగారి లింగన్న,కమ్మరి మోనేష్,కోటగారి వీరేశ్,రాజన్న, తిమ్మప్ప,కోమటి తిమ్మయ్య,వాల్మీకి నాగరాజు, అబ్రహం,గోనుపాడు రాము,కొళాయి భాస్కర్,గంగాధర్,గోవిందు, మహేష్,శ్రీకాంత్, కుమ్మరి రంగన్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జండా ఆవిష్కరణకు ర్యాలీగా వెళుతున్న బిఆర్ యస్ శ్రేణులు

# ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి : డీఎస్పీ నల్లపు లింగయ్య

**నారాయణపేట, జూలై 21 ప్రభాతవార్త :** సోమవారం రోజు డీఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 5 మంది ఫిర్యాదులను డీఎస్పీ నల్లపు లింగయ్య పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడి వెంటనే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుదారుల పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తదుపరి కేసు విచారించి పరిష్కరించాలని తెలిపారు. భూ తగదాలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే తప్పకుండా రసీదు, ఎఫ్ఐఆర్ కాఫీ ఇవ్వాలని పోలీసు అధికారులకు తెలిపారు. జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా భద్రత కల్పించాలని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ తెలిపారు.




ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ

# ప్రజా ప్రభుత్వ పాలనలో హామీలన్నీ అమలు

### దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి

**దేవరకద్ర, జూలై 21 ప్రభాతవార్త:** ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో 80 శాతం,18 నెలలకే అమలు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనని దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవరకద్ర మండల పరిధిలోని కోయిల్ సాగర్, అడవి అజిలాపూర్, రెండు గ్రామాలలో దేవరకద్ర మండల సమన్వయ కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు పర్యటించి, దేవరకద్ర మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని వివరించి, తదనంతరం కోయిల్ సాగర్, అడవి అజిలాపూర్, గ్రామాలకు సంబంధించిన సమస్యలు తెలుసుకుని, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాము అని మండల నాయకులు తెలియజేశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలందరికీ పదవులు వెతుక్కుంటూ వస్తాయని, ఎవరు కూడా నిరుత్సాహం చెందవద్దని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కావున అందరూ కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్, ఎంపీటీసీలను గెలిపించాలని దేవరకద్ర మండల సమన్వయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు కొండ గోవర్ధన్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, గోపాల్, గోవర్ధన్ యాదవ్, రామాంజనేయులు, మాశ్చందర్‌రెడ్డి, మాధవులు, విజయ్ రావు, వెంకటేష్, నాగిరెడ్డి, రాజు గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, జైపాల్ రెడ్డి, ఎండి జాఫర్, చంద్రమౌళి, పూర్ణిత, రెండు గ్రామాల కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి

# జులై 31న టీయూసీఐ ఛలో కలెక్టర్‌ను జయప్రదం చేద్దాం

**నారాయణపేటటౌన్,జూలై 21 ప్రభాతవార్త :** కార్మికవర్గానికి కనీస వేతనం ఇరవై ఆరు వేలకు పెంచాలని, పని గంటల పెంపు జీవో 282ను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టీయూసీఐ ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్‌లను విజయవంతం చేయాలనీ టీయూసీఐ రాష్ట్రఉపాధ్యక్షులు ఎం.హన్మేశ్ పిలుపునిచ్చారు.సోమవారం ట్రేడ్‌యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నారాయణపేట జిల్లా కమిటీ సమావేశం భగత్‌సింగ్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా పెట్టుబడి దారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చింది అన్నారు. కార్మిక సంఘం నిర్మాణం చేసుకునే హక్కును నిర్వీర్యం చేసిందన్నారు. కార్మికులకు వారి కుటుంబాలకు మంచి విద్యా కావాలి, మంచి వైద్యం కావాలి మంచి పౌష్టికమైన ఆహారం కావాలి అనే ఉద్దేశం ప్రభుత్వాలకు కానీ యజమానులకు కానీ లేదన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస పెన్షన్ తొమ్మిది వేలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ ఈ నెల 31న టీయూసీఐ ఆధ్వర్యంలో జరిగే ఛలో కలెక్టర్ కార్యక్రమంలో పెద్దఎత్తున కదిలి రావాలని అన్నారు. ఈ సమావేశంలో బోయిన్‌పల్లి రాము, కె.కాశీనాథ్, బి.నర్సింహా, సుశాంత్, పద్మమ్మ, వెంకటయ్య, కెంచి నారాయణ, సలీమ్, సాబీర్, రఫియా బేగం, తదితరులు ఉన్నారు.

# అసంపూర్తిగా ఉన్న కోటకొండ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

**నారాయణపేట టౌన్, జూలై 21 ప్రభాతవార్త :** అసంపూర్తిగా ఉన్న కోటకొండ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.నర్సింహ, టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ భవన్‌లో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోయిలకొండ నుండి అపక్ పల్లి వరకు అసంపూర్తిగా ఉన్న కోటకొండ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఆటోలు బైకులు, పోవడానికి ఇబ్బందిగా ఉందన్నారు. ఈ రోడ్డు పరిస్థితి చూసి ఆర్టీసీ వాళ్లు ఈ ప్రాంతాలకు బస్సులు రద్దు చేయడం జరిగింది. ఈ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆటోలకు వచ్చే డబ్బులు రిపేర్ కు సరిపోవడం లేదని ఆటోలు సైతం నడపడం లేదన్నారు. ఈ విషయంపై నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, అడిషనల్ కలెక్టర్ వారం రోజుల క్రిందట వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. నేటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులను పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ నాయకులు యూసుఫ్, భీమ్రాజ్, రవికుమార్, అబ్బాస్, ఆశప్ప, చందు, గులాం రసూల్ తదితరులు ఉన్నారు.




మాట్లాడుతున్న టియుసిఐ నాయకులు

## మండలంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలకు తరలి వెళ్లిన మహిళలు



సమావేశానికి తరలివెళ్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

**ఉప్పునుంతల, జూలై 21 ప్రభాతవార్త :** అచ్చంపేట పట్టణంలో సోమవారం జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు మండలం నుంచి భారీ సంఖ్యలో మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు తరలి వెళ్లారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉప్పునుంతల మండలం నుంచి అన్ని గ్రామ సంఘాలు, మహిళలు తరలివెళ్లారు. అదేవిధంగా రేషన్ కార్డులు, రేషన్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకొన్న లబ్ధిదారులు అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

## అధ్వానంగా మారిన దాసర్లపల్లి మామిళ్ళపల్లి రోడ్డు



దాసర్లపల్లి నుంచి మామిళ్ళపల్లి వరకు ఏర్పడ్డ గోతులు

**ఉప్పునుంతల, జూలై 21 ప్రభాతవార్త :** మండలంలోని దాసర్లపల్లి నుంచి మామిళ్లపల్లి మార్గం అధ్వానంగా మారింది. మండల కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉన్న దాసర్లపల్లి గ్రామం నుంచి మామిళ్ళపల్లికి వెళ్లే మార్గం గోతులు ఏర్పడి పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొంది. పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్లు అధ్వాన స్థితికి చేరాయి. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఈ మార్గం బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## బీజేవైఎం మండల నూతన కమిటీ ఎన్నిక



బీజేవైఎం మండల నూతన కమిటీని ఎన్నుకున్న దృశ్యం

**బాలానగర్, జూలై 21 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలో భవాని మాత ఆలయ ప్రాంగణంలో సోమవారం మండల బీజేవైఎం అధ్యక్షులు కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, జిల్లా ఐటీ సెల్ బీజేవైఎం గణేష్‌లు పాల్గొన్నారు. బీజేవైఎం నూతన కమిటీలో మండల ప్రధాన కార్యదర్శులుగా భరత సింహాచారి, సందీప్ కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీరామ్, నవీన్‌కుమార్, సెక్రటరీలుగా దండు రఘు, రాఘవేందర్, శ్రీకాంత్, రమేష్, భాను, విష్ణు, కోశాధికారిగా అన్వేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రాజ్ కుమార్, నరేందర్, రాజు, సాయికిరణ్, అరవింద్, శ్రీశైలంలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ నాయక్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ బలోపేతానికి శాయశక్తుల కృషిచేసి, వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

**నారాయణపేట టౌన్, జూలై 21 ప్రభాతవార్త :** నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారంతో 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల జిల్లా నాయకులు వెంకట్రామరెడ్డి, బలరాంతో బాటు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం రూ. 14 లక్షలు ఎకరాకు ఇస్తాననడం సమంజసం కాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఎకరా రూ.30 లక్షల పైబడి ధర ఉందని అన్నారు. భూమికి బదులు భూమి చూయించాలని ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బలవంతంగా భూములు తీసుకోవడం ఆపాలి, రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చి వారిని సంతృప్తి పరిచిన తరువాత భూములు సేకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీక్షలో జాజాపూర్ సింగారం గ్రామస్తులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవులు, ఆంజనేయులు సింగారం హన్మంతు, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్ యాదవ్ బిఆర్ఎస్‌కు రాజీనామా


గోపాల్ యాదవ్ (ఫైల్)

**మహబూబ్‌నగర్, జూలై 21 ప్రభాతవార్త:** రైతుబంధు సమితి మహబూబ్‌నగర్ జిల్లా మాజీఅధ్యక్షుడు గోపాల్‌యాదవ్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. సోమవారం ఆయన తన రాజీ నామా లేఖను సమర్పించినట్లు తెలుస్తోంది. రాజకీయ జీవితాన్ని కాంగ్రెస్‌తో ప్రారంభించిన గోపాల్‌యాదవ్ 1975లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు.ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్య తలు నిర్వర్తిస్తూ, కౌన్సిలర్‌గా పలుమార్లు ఎన్నికయ్యారు. కొంతకాలం బీఆర్ఎస్‌లో కొనసాగిన గోపాల్ యాదవ్, మళ్లీ కాంగ్రెస్‌లో చేరినా 2018లో తిరిగి బీఆర్ఎస్‌కు వలస వచ్చారు. 2020లో రైతుబంధు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు బీఆర్ఎస్‌కి సేవలందిస్తూ వస్తున్నారు. అయితే తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయన బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. త్వర లోనే ఆయన కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలు ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు చర్చిస్తున్నాయి.

## ఉమ్మడి మండలంలో 274 వార్డులు

● ఇటిక్యాలలో 130 వార్డులు ● ఎర్రవల్లిలో 144 వార్డులు

**ఇటిక్యాల, జూలై 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 30వ తేదీలోగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమవుతుంది. ఎన్నికల కమిషన్ కూడా ఆ దిశగానే అధికారులను సమాయత్తం చేస్తుండగా మండల పంచాయతీ అధికారులు ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమ య్యారు.ఉమ్మడి మండలంలోని 29 గ్రామపంచాయతీలలో 274 వార్డులు ఉండగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 274 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలను నిర్వహిం చనున్నారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి మండలంలోని 29 పంచాయతీలకు 274 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. ప్రజలకు సుపరిపాలన నేపథ్యంలో ఉమ్మడి మండలం నుండి కొత్త మండలం ఎర్రవల్లి కేంద్రంగా ఏర్పాటు చేయాలని జిల్లా కేంద్రానికి కాలినడక అలాగే నిరాహార దీక్షలువంటి కార్యక్రమాలు 15గ్రామ పంచాయతీలప్రజలు ప్రజాప్రతినిధులు చేపట్టడంతో 2023 జూలై నెలలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎర్రవల్లి గ్రామపంచాయతీని మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది.దీంతో త్వరలో జరిగే స్థానికసంస్థల ఎన్నికలు పాత ఇటిక్యాల మండలం, కొత్తగా ఏర్పడిన ఎర్రవల్లిమండలం వేరువేరుగా ఎన్నికలు జరగనున్నాయి.ఇటిక్యాల మండలంలో 14 పంచాయ తీలకు గాను బుడ్డారెడ్డి పల్లెలో 8వార్డులు, చాగాపురం 12, గోపాల్ దిన్నె 8, ఇటిక్యాల 10, మొగలి రావల్ చెరువు 8, మునగాలలో 10, నక్కలపల్లి 8, పెద్దదిన్నె 10, సాతర్ల 10, శనగపల్లి 8,షాబాద్ 10, శివంపల్లి 8,ఉదండాపురం 10,వావిలాల10 వార్డుల చొప్పున ఉన్నాయి.
కొత్త ఎర్రవల్లి మండలంలో 15 పంచాయతీలకు గాను బట్లదిన్నెలో 8 వార్డులు, బీచుపల్లి 10, బి.వీరాపురం 8, ధర్మవరం 12, జింకలపల్లి 8, కోదండపురం 10, కొండేరు 12, పుటాన్ దొడ్డి 10, ఆర్‌గార్లపాడు 10,సాసనూలు10, షేకుపల్లి8, తిమ్మాపురం8, వల్లూరు10, వేముల 10, ఎర్రవల్లిలో 10చొప్పునవార్డులు ఉండగా త్వరలోజరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు వార్డు మెం బర్లకు, సర్పంచులకు, ఎంపీటీసీలకు జడ్పిటిసి స్థానాలకు స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించనున్నారు.

## ప్రతి వ్యక్తిని బలమైన ఆర్థికవంతులుగా తీర్చిదిద్దడమే స్వేరోయిజం లక్ష్యం

■ స్వేరోస్ చాయ్ కేఫ్ ఫౌండర్ రంజిత్ స్వేరో


ఫౌండర్‌ని సన్మానిస్తున్న స్వేరోస్ జిల్లా, మండల నాయకులు

**తెలకపల్లి, జులై21 ప్రభాతవార్త:** సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరిని విజ్ఞానం వైపు నడిపిస్తూ బల మైన ఆర్థికవంతులుగా తీర్చిదిద్ద డమే స్వేరోయిజం లక్ష్యమని స్వేరోస్ చాయ్ కేఫ్ ఫౌండర్ రంజిత్ స్వేరో అన్నారు. సోమ వారం మండల కేంద్రంలో స్వేరోస్ నాయకుల ముఖ్య సమా వేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆలోచన విధానంతోనే పుట్టిన స్వేరోస్ నెట్వర్క్, ప్రతి ఒక్కరిని బలమైన ఆర్థికవంతులను చేయడమే ప్రధానలక్ష్యం అని అన్నారు. వ్యాపారరంగంలో విజ్ఞానవంతులుగా మారాలంటే స్వేరోస్ నెట్వర్క్ నిరంతరం తోడ్పడుతుందని అన్నారు. అనంతరం వారిని స్వేరోస్ నాయకులుఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్వేరోస్ ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ సంపత్‌కుమార్, తెలకపల్లి టౌన్ అధ్యక్షులు పరమేశ్వర్, వంగూరు మండల అధ్యక్షులు దార్ల కాశయ్య,స్వేరోస్ నాయకులు మూర్తి సాగర్, భాస్కర్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల వర్క్ షాప్

● భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి

**దేవరకద్ర, జూలై 21 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ జిల్లా స్థాయి స్థానిక ఎంపీటీసీ, జడ్పి టిసి ఎన్నికల వర్క్ షాప్ నేడు ఉదయం 10 గం.లకు మహబూబ్‌గర్ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా జిల్లా వర్క్ షాప్ నిర్వహించబడుతుందని దేవరకద్ర భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కొండ ప్రశాంత్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక ఎంపీటీసీ, జడ్పిటిసి, ఎన్నికల విధివిధానాలు ఎన్నికలలో అవలంబించవలసిన వ్యూహాలు,కార్యచరణ గురించి ఈ వర్క్‌షాప్‌లో చర్చించబడునన్నారు.ఈ వర్క్‌షాప్‌లో జిల్లా అధ్యక్షులు, జిల్లా రాష్ట్ర పదాధికా రులు, జిల్లా కన్వీనర్, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ ఇన్చార్జిలు, మండల అధ్యక్షులు, మండల ప్రభారీలు,వివిధ మోర్చాల,అధ్యక్ష ప్రధానకార్యదర్శులు,జిల్లా మాజీఅధ్యక్షులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, జిల్లా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికైన కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కొండ ప్రశాంత్ రెడ్డి కోరారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

● సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్‌రామ్

**నారాయణ పేట, జూలై 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కలెక్టరేట్ ముందు నేడు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్ రామ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయా లని కోరుతూ జిల్లా 9 నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని అదే విధంగా కోడిగుడ్డు బిల్లులు కూడా పెండింగ్లో ఉన్నాయని మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు 18నెలలుగా పెండింగ్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పెండింగ్ బిల్లు కోటిన్నరకు పైగా బకాయి బిల్లులు ఉండగా మరోవైపు ప్రభుత్వ అధికారులు మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లేదని మెనూ పాటించడం లేదంటూ మధ్యాహ్నం భోజనం కార్మికులను అక్రమ తొలగింపులకు పాల్ప డుతున్నారని విమర్శించారు. అక్రమ తొలగింపులు ఆపాలని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ జరిగే ధర్నాకు మధ్యాహ్న భోజన కార్మికులు వంటలు బంద్ చేసి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా నేడు రేషన్ కార్డుల పంపిణీ

**నారాయణపేట టౌన్, జూలై 21 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో నేడు ఎమ్మెల్యే డా. పర్ణిక రెడ్డి పర్యటించి నేడు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఉదయం 10 గం.లకు ధన్వాడ మండల కేంద్రంలోని ధన్వాడ ఫంక్షన్ హాల్‌లో ధన్వాడ,మరికల్ మండలాలకు ఉమ్మడి ధన్వాడ మండలం చెందిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గం.లకు నారాయణపేటలోని అభినందన్ గార్డెన్‌లో నారాయణపేట మండలం,నారాయణపేట పట్టణానికి చెందిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం4గం.లకు దామరగిద్ద ఎంపీడీఓ కార్యాలయంలో దామరగిద్ద మండలా నికి చెందిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. కావున లబ్ధిదారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## గ్రామాల్లో తాగునీటి సమస్యకు చెక్ పెట్టేందుకు ఎమ్మెల్యే కృషి

● ఏఎంసి వైస్ చైర్మన్ జవాజి శేఖర్‌గౌడ్


ఎమ్మెల్యే సొంత నిధులతో బోరు వేయించిన దృశ్యం

**రాజాపూర్, జూలై 21 ప్రభాతవార్త:** గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు చెక్ పెట్టేందుకు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగానే సోమవారం రాజాపూర్ మండలం లోని ఖానాపూర్ గ్రామంలో తన సొంత నిధుల తో బోరు వేయిం చినట్లు ఏఎంసీ వైఎస్ చైర్మన్ జవాజి శేఖర్‌గౌడ్ తెలిపారు.ఖానాపూర్ గ్రామం లోని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఆదివారం బోరు డ్రిల్లింగ్ వేయడంతో పుష్కలంగా నీరు వచ్చి నట్టు తెలిపారు. గ్రామంలో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా ఏఎంసీ వైఎస్ చైర్మన్ జవాజి శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి జనంపల్లి శశికళరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ నాయక్, వెంకటేశ్వర రెడ్డి, మహిపాల్ రెడ్డి, నారాయణ నాయక్, మోటె సత్యం, రాములు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలను ముందుకు తీసుకెళ్లాలి

- లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్లు జూలూరు రమేష్ బాబు, జూలూరు రఘు



నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూలై 21 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ కల్వకుర్తి ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకు వెళా ల్సిన అవసరం ఉందని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్లు జూలూరు రమేష్ బాబు, జూలూరు రఘులు కోరారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని లయన్స్ భవనంలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు కలిమిచెర్ల రమేష్ అధ్యక్షతన నిర్వ హించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గత సంవత్సర కాలంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను చర్చించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవలు ప్రజలకు అందించాలని జూలూరి రమేష్‌బాబు, రఘులు కోరారు. ఈసందర్భంగా వారి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్య క్షులుగా చిగుళ్ల పల్లి శ్రీధర్, కార్యదర్శిగా కలిమిచెర్ల గోపాల్, కోశాధికారిగా మిర్యాల శ్రీనివాస్‌రెడ్డిని ఎనుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కల్వకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులను, కమిటీ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సభ్యులు బచ్చు రామకృష్ణ, క్లబ్ కోశాధికారి గోవిందు శ్రీని వాస్, క్లబ్ సభ్యులు పాపిశెట్టి శ్రీనివాస్, సతీష్ గుప్తా, దుగ్గి వెంకటేష్, గుబ్బ కిషన్, మయూరి వేణు, జూలూరు సత్యం, రవి గౌడ్, గణేష్, జూలూరు ప్రకాష్, అప్పాయిపల్లి శ్రీనివాస్, సాత వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి, గోవింద్ కృష్ణయ్య, శివ్వ జగదీశ్వర్, బుచ్చయ్య, శర్మ తదితరులు పాల్గొన్నారు.

## టీయుడబ్ల్యూజే జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

■ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్

**పెబ్బేరు,జులై21 ప్రభాతవార్త:** టీయుడబ్ల్యూజే (ఐజేయు) తృతీ య జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ స్టేట్ సెక్రటరీ గుండ్రాతి మధుగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం పెబ్బేరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన జిల్లా మహాసభల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్‌అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నడు స్తున్న టీయుడబ్ల్యూజే యూనియన్ పెద్దపీట వేస్తుందని అన్నారు. ప్రతి సమస్యలపై గళమెత్తి రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి జర్నలిస్టులకు కావలసిన విద్య, వైద్యం, అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలపై మొదటి నుంచి కొట్లాడి ఇప్పించిన ఏకైక యూని యన్ టీయూడబ్ల్యూజే అని చెప్పారు. 3వ జిల్లా సభలకు ముఖ్య అతిథులుగా మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, ప్రణాళిక సంఘంఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి,దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్, ఐజేయు స్టీరింగ్ కమిటీ మెంబర్ దేవులపల్లి అమర్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరా హత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్‌ఛైర్మన్ శివసేనారెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి వస్తున్నారని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా వారిని కోరనున్నట్లు తెలిపారు. కమిటీలో ఉండేవారే లీడర్లు కాదని, సభకు వచ్చే ఒక్క జర్నలిస్టు లీడరేనని అన్నారు.జిల్లా మహాసభలకు అన్ని మండలాల నుంచి యుని యన్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై జర్నలిస్టుల ఐక్యతను చాటుతూ జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఇటీవలే న్యాయవాద పట్టా అందుకున్న సీనియర్ జర్నలిస్టు పొర్ణారెడ్డిని పెబ్బేరు ప్రెస్‌క్లబ్ సభ్యులతో పాటు వనపర్తి నుంచి వచ్చిన యూనియన్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మాధవరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్, జర్నలిస్టులు ఊషన్న, శ్రీనివాసరావు, రాజు, మన్యం, నరసింహరాజు,అరుణ్, ఎన్.శ్రీనివాస్,రవికాంత్,విజయ్ కుమార్, బాలరాజు, కిరణ్‌కుమార్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, గోపాలకృష్ణ, ఎ.విజయ్,పరశురాముడు,కెఎం.భాషా, మన్యం,బలపాల రమేష్, నాగరాములు,రాంబాబు,రామకృష్ణ,రంజిత్,తరుణ్,ప్రకాష్, గోపి, నాగరాజు,మహేష్,శంకర్,మిద్దె రాములు,శ్రీకాంత్, బద్రుద్దీన్, గోవిందు,రాజేష్, ఎం.రాములు,ఎ.రాము, శివరాజు పాల్గొన్నారు.

## యువత సామాజిక సేవలో ముందుండాలి


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూలై 21ప్రభాతవవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవాబృందం ఆధ్వర్యంలో గత 13 సం॥లు గా చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలపై ప్రత్యేక బ్రోచర్‌ను తెలంగాణ బిజెపి రాష్ట్ర ఆధ్యక్షులు రాంచందర్‌రావు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండావిశ్వేశ్వర్‌రెడ్డి చేతులమీదుగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోని గురజాడ కాన్ఫరెన్స్ హాలులో ఆవిష్కరించి నట్లు శివ తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్ సేవా బృందం ఆధ్వర్యం లో చేస్తున్న సేవ కార్యక్రమాలను, శివ అగ్రిక్లినిక్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై తెలంగాణ బిజెపి రాష్ట్ర అధికారులకు వివరించారు. అనంతరం నాయకులు సేవ బృందం సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాతిభరత్, రాష్ట్రపతి జాతీయ అవార్డు గ్రహీతలు జీవన్ కుమార్,జయ మారుతి,ఆభాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాబోయ్ కోతులు..

కోతులతో భయపడుతున్న ప్రజలు


ఇంటిమీద ఉన్న కోతులు

**మద్దూర్,జూలై 21 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణ కేంద్రంలో గతవారం రోజుల నుంచి కోతుల బెడత విపరీ తంగా తయారైంది.కోతులు ఇళ్లలోకి, ఇళ్లపైకొచ్చి దాడులు చేస్తు న్నాయని పలువురు మహిళలుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటికి ఆహారం అడవిలో దొరకపోవడంతో ఇళ్లల్లోకి వచ్చి దాడులు చేస్తు న్నాయి. రోడ్డు మార్గాన ప్రజల చేతుల్లో కవర్లు కనిపిస్తే చాలు వాటినిలాక్కొని వెళుతున్నాయి. ఫారెస్ట్ అధికారులు వాటిని సురక్షిత ప్రాంతానికి తరలించాలని పలువురు మహిళలు గ్రామ పెద్దలు కోరుతున్నారు.

## కొండచిలువ పట్టువేత


చెనిమిళ్ళలో పట్టుకున్న కొండచిలువతో సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు

**పెబ్బేరు, జూలై21 ప్రభాత వార్త:** పెబ్బేరు మున్సిపాలిటీ చెలిమిళ్ళ గ్రామంలో సోమ వారం తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో పెళ్లూరి చెన్నకేశవులు ఇంటి ముందు రాత్రి నిద్రస్తుండగా కుక్కలు అరవడంతో లేచి మళ్లీ పడుకునే క్రమంలో అప్పటికే పరుపుల వద్ద బుస కొడుతున్న కొండచిలువను చూసి భయాందోళనలకు గురయ్యాడు. వెంటనే వారి పెదనాన్న సాయన్నను తీసుకొచ్చి చూపగా అప్పటికే మెట్ల కిందకు కొండచిలువ చేరుకున్నది. వెంటనే వారి ఇంటి పక్కన ఉన్న మల్లేష్‌కు సమాచారం ఇస్తే వనపర్తి జిల్లా కేంద్రంలో ఉన్న సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షులు కృష్ణ సాగర్‌కి ఫోన్ చేయగా వారు వెంటనే స్పందించి వారి బృందంతో గ్రామానికి చేరుకొని కష్టపడి సురక్షితంగా బంధించడం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ సాగర్ మాట్లాడుతూ గ్రామస్తులకు ఎవరైనా ఏ పాములు ఇతర ప్రాణులు కనపడితే వెంటనే సంబంధిత ఫారెస్ట్ అధికారులకు తెలియజేయ గలరని సూచించారు. బంధించిన కొండచిలువను సురక్షితంగా అడవి ప్రాంతంలో ఫారెస్ట్ అధికారుల సమక్షంలో వదిలేస్తానని తెలిపారు.ఈ కొండచిలువ పొడవు 7 ఫీట్లు బరువు 13 కేజీలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ విజయ్‌సాగర్, స్నేక్స్ సొసైటీ సభ్యులు కుమార్ సాగర్, అవినాష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

**కల్వకుర్తి, జూలై21 ప్రభాతవార్త:** పుస్తకాలు చదవడం వల్ల వ్యక్తిత్వ వికాసం, మెరుగైన భాషా నైపుణ్యాలు, జ్ఞాపకశక్తి మరియు ఏకాగ్రత మెరుగుపడతాయని కల్వకుర్తి సీఐ నాగార్జున అన్నారు. ప్రతి ఒక్కరు పుస్తక పఠనం అలవాటు చేసుకొని నిత్యం పుస్తక పఠనం చేస్తే ఒత్తిడితగ్గి, జ్ఞానం పెరుగుతుందని సీఐ పేర్కొ న్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు ఓ దిన పత్రిక వారు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన షాప్‌ను ఎస్ఐ మాధవరెడ్డితో కలిసి సీఐ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పరశురాములు, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, శివ తదితరులు ఉన్నారు.

## ముగిసిన కౌడి పీర్ల పండగ

■ పురవీధుల్లో ఊరేగిన యానగుంది మౌలాలి

**దేవరకద్ర, జూలై 21 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో గత రెండు రోజుల నుండి యానగుంది మౌలాలి పీర్ల ఊరే గింపు సోమవారంతో ముగిసాయి. ప్రతి ఏడాది గ్రామంలో యానగుంది మోలాలి కౌడి పీర్ల వేడుకలు ఘనంగా నిర్వహిం చడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా కౌకుంట్ల మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు భారీగా కౌడి సవారిలో పాల్గొనడం జరిగింది. వివిధ ప్రాంతాల ముస్లింలతో పాటు, హిందువులు కూడా పీర్ల చావిడిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగే యానగుంది మోలాలి కౌడిపీర్ల దర్శనానికి భారీ ఎత్తున ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొని, కౌడి పీర్లకు మాలీజా, పంచి అలాయి, దూలై, అను కుంటూ అలాయి ఆడుతూ ఎంతో ఘనంగా కౌడి పీర్ల సవారినీ ఆడుతూ ఆనంద పరవశంలోకి వెళ్లిపోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమాలు ముగిసిన తర్వాత కౌడి పీర్లు బాయికి వెళ్లడం జరిగింది.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై నాగన్న చర్యలు తీసుకున్నారు. పెద్దఎత్తున హిందూ, ముస్లింలు,తరలివచ్చి మొక్కులు చెల్లించుకునేందుకు రావడంతో కౌకుంట్ల మండల కేంద్రంలో వీధులన్నీ కిక్కిరిసి పోయాయి.

## నేడు నూతన రేషన్ కార్డుల పంపిణీ

**దామరగిద్ద, జూలై21 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రం లో నేడు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో సాయంత్రం 4గం.లకు మండలానికి చెందిన నూతనంగా మంజూరైనరేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. లబ్ధిదా రులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు, ప్రజలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దామరగిద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి కోరారు

## సీపీఐ జిల్లా 3వ మహా సభలను జయప్రదం చేయండి

**కల్వకుర్తి, జూలై 21 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఉదయం సీపీఐ నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు విలేకరుల సమావేశం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1, 2వ తేదిలో సీపీఐ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా 3వ మహాసభలు కల్వకుర్తి పట్టణంలో నిర్వహిస్తున్నామని, ఆగస్టు 1న హైదరా బాద్ చౌరస్తా వద్ద ఉన్న మార్కెట్ యార్డ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ బహి రంగసభకు ముఖ్య అతిథులుసీపీఐరాష్ట్ర కార్యదర్శి కొత్త గూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే చాడవెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల్ నరసింహులు హాజరవుతున్నారు. ఆగస్టు2వ తేదీన ఎం.ఎ డీఓ కార్యాలయంఎదురుగా ఉన్న శుభం ఫంక్షన్ హాల్‌లో ప్రతి నిధుల సభ ఉంటుందన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లానలు మూలల నుంచి సీపీఐ కామ్రేడ్స్ పెద్ద ఎత్తున తరలివచ్చి ఈసభలను విజయవంతం చేయాలనికోరారు.విలేకరుల సమా వేశంలో సీపీఐ జిల్లా నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, ఊర్కొండ సీపీఐ మండల కార్యదర్శి దారదాసు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు

## గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తాం


బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మాజీ సర్పంచ్ వావిళ్ళ వెంకటమ్మ

**వెల్దండ, జూలై 21 ప్రభాతవార్త:** గ్రామాన్ని అన్ని రంగాల్లో అభి వృద్ధి పరుస్తామని పోతేపల్లి మాజీ సర్పంచ్ వావిళ్ళ వెంకటమ్మ అన్నారు.పోతేపల్లి గ్రామంలో సోమవారం పోతేపల్లి మీదుగా జూపల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణపనులను పరిశీలించారు. పోతే పల్లి నుండి మండల కేంద్రానికి బీటీ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రజల అవసరాలను గుర్తించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్‌మానిలా సంజీవ్ యాదవ్‌కు గ్రామస్తుల ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, భీమయ్య, బుచ్చయ్యగౌడు, ఆంజనేయులు, సత్యనారాయణ, వెంకటయ్య, యాదగిరి, గణపతి, అల్లాజితో పాటు తదితరులు ఉన్నారు.

## 23న మండలానికి మంత్రి శ్రీహరి రాక

**చిన్న చింతకుంట,జూలై21 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధకశాఖ,పాడిపరిశ్రమల అభివృద్ధి, క్రీడలు యువజన సర్వీసు లశాఖ మంత్రి వాకిటిశ్రీహరి,స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డిలు బుధవారం మండలానికి రానున్నారు. ఉదయం 9గం.లకు శ్రీ కురుమూర్తిపుణ్యక్షేత్రానికి మంత్రితోపాటు ఎమ్మె ల్యేలు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవంతో పాటు శంకు స్థాపనలను చేయనున్నట్లు దేవస్థాన చైర్మన్ గౌనిగోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉద యం 10గం.లకు మండలకేంద్రంలోని మండల వనరుల భవనం వద్ద ఉపాధ్యాయవృత్తికి వన్నె తెచ్చిన డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని మంత్రితోపాటు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరణ ఉంటుందని మండల విద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ, జూలై 21 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు గోసుల రాములు సతీమణి రాజ మ్మ, అదే విధంగా బిఎంసియు అధ్యక్షులు ఎండి యాకుబ్ సోద రుడు రుక్నోద్దిన్ కుమారుడు అసిఫ్‌లు ఇటీవల మృతి చెందారు. ఇరువురు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌లు కుటుంబాలను పరా మర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పిం చారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. కార్య క్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు లక్ష్మీనరసింహ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, టిఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షులు జంగిలి యాదగిరి, నాయకులు నిరంజన్, ఎండి.అలీం, హనుమంతు, లచ్చిరాంనాయక్, జంగిలి ప్రసాద్, పోలే అశోక్, జంగిలి ఆనంద్, దశరథ్, ప్రవీణ్, గణేష్, శ్రీను, బాలకృష్ణ, అన్వర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## బీసీల ఐక్యతను చాటుదాం!

**వెల్దండ, జూలై 21 ప్రభాతవార్త:** బీసీలందరం ఐక్యతగా ఉండి బీసీల ఐక్యతను చాటాలని దుగ్గాపురం యాదయ్య అన్నారు. వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో సోమవారం బీసీలచైతన్య గ్రామబాట పర్యటనలోభాగంగా గ్రామంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా యాదయ్య, బ్రహ్మయ్యలు మాట్లాడుతూ గ్రామ గ్రామానతిరుగుతూ బీసీలను చైతన్య పరుస్తూ సమస్యలను తెలుసుకోవడం జరిగిందని,రాజకీయంగా,ఆర్థికంగా, బీసీలు ఎదగా లన్నారు. కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, గణేష్, శ్రీను, మహేష్ కుమార్, విజయ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి కోసం స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు

**దేవరకద్ర, జూలై 21 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మంజూరు చేసిన ప్రభుత్వ ఆసుపత్రికి భూమి పూజ చేసేందుకు స్థల పరిశీలన చేశారు. స్థల పరిశీలన చేసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, టిపిసిసి ఆర్గనైజ షన్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డిలు ఉన్నారు. ఈ సందర్భంగా ఈనెల 23వ తేదీ బుధవారం రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి,దేవరకద్ర ఎమ్మెల్యేమధుసూదన్‌రెడ్డి, కౌకుంట్ల మండలానికి హాజరై ప్రభుత్వ ఆసుపత్రికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొం టారని,కౌకుంట్ల మండలకాంగ్రెస్ నాయకులు కోరారు. కార్యక్ర మానికి కౌకుంట్ల మండల అధ్యక్షులు, వివిధ ప్రజా ప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని వారు కోరారు. కౌకుంట్ల మండల ప్రజల కోసం సంక్షేమం,అభివృద్ధిపై చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి, కౌకుంట్ల మండల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూలై21 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా యన్.టి ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, అటానమస్ మహబూబ్‌నగర్‌లో 2025,26 విద్యాసంవత్సరానికిగాను, ఇంగ్లీష్, హిందీసంస్కృతం అరబిక్ తెలుగు, కామర్స్, కంప్యూ టర్స్ సైన్స్ అప్లికేషన్,హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జువాలజీ, అప్లైడ్ న్యూట్రిషన్, బయోటెక్నాలజీ, స్టాటిస్టిక్స్ ఫిజిక్స్ ఎకనామిక్స్ ఉర్దూ మీడియం, పొలిటికల్ సైన్స్ ఉర్దూ మీడియం సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ) కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సి పల్ ప్రొ॥వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. అభ్యర్థులు పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేషన్)లో సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలి. నెట్, స్లెట్, సెట్, పి.హెచ్.డి ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.పై సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకునేవారు అన్ని సర్టిఫి కెట్స్ జిరాక్స్ కాపీలతో 23.07.2025 సాయంత్రం మూడు గంటలలోపు యన్‌టిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అటాన మస్,మహబుబూనగర్ ఆఫీస్‌లోదరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో, 24.07 .2025 గురువారం నాడు ఉదయం 10:00 గంటలకు ఎన్‌టి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, అటానమస్, మహబుబూ నగర్‌లో ఇంటర్వ్యూ మౌఖికపరీక్షకు హాజరు కావాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ॥ వి.రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేసారు.



# ఘనంగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

**కల్వకుర్తి, జూలై 21 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పేరిట ఏర్పాటు చేసిన కేక్‌ను కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీమ్ముల శ్రీకాంత్ రెడ్డిలు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిజామోదిన్, ఆంజనేయులు, పుస్తకాల రాహుల్, జమ్ముల శ్రీకాంత్, సంతు యాదవ్, రామకృష్ణ, ప్రవీణ్, రేష్మ, రెహానా, ఆరిఫ్, దున్న భాస్కర్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, మహేష్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

**వెల్దండ, జూలై 21 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదినోత్సవాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖర్గే పేరిట ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, ఎండి రషీద్, తిరుపతిరెడ్డి, ఎర్ర శ్రీను ముదిరాజ్, పుల్లయ్య, భరత్‌గౌడ్, వెంకట్‌నాయక్, చంద్యానాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

**ఇటిక్యాల, జూలై 21 ప్రభాతవార్త:** అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే జన్మదినం పురస్కరించుకొని సోమవారం మండల పరిధిలోని జింకలపల్లి స్టేజి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, జోగుల రవి, వెంకటేష్ యాదవ్, సోమిరెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు కేక్ కట్ చేసి ఆయన జన్మ దిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ కోసం నిబద్ధతతో పని చేస్తూ ఎన్నికల్లో ఓటమి ఎరుగని నేతగా ఉన్నారని అలాగే రాజకీయ ఉద్దండుగా అంచెలం చెలుగా ఎదిగి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుని స్థాయికి చేరుకున్నారన్నారు.

**తెలకపల్లి, జూలై 21 ప్రభాతవార్త:** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పుట్టినరోజువేడుకలను సోమవారంమండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, మాజీ సర్పంచ్ సురేఖ బాలగౌడ్, మాజీ సర్పంచ్ గౌరెడ్డిపల్లి సూర్య, బాలగౌడ్, గుగ్గిల ప్రకాష్, మాజీ ఎంపిటిసిలు జింకల ఈశ్వరయ్య, ఎంపీటీసీ బొప్పల్లి నిరంజన్, పెద్దూరు బుచ్చిరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ పర్వతాపురం రేణయ్య ఎల్‌ఐసి శేఖర్, శారదా నరహరి, మల్లెపల్లి వెంకట్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, బారిగారి లక్ష్మణ్, కొమ్ము ఎల్లస్వామి, మెట్రో శివ, కుమ్మరి బాలస్వామి, మైనారిటీ నాయకులు ఎండీ ఫరీద్, యాసీన్, తుమ్మ చరణ్, రాంరెడ్డిపల్లి, కృష్ణయ్య, సోషల్ మీడియా ఇంఛార్జి తెలకపల్లి మండలం రెడ్డపాకుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**మక్తల్ టౌన్, జూలై 21 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ.రవికుమార్ ఆధ్వర్యంలో అఖిలభారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మక్తల్ నియోజకవర్గానికి అతి దగ్గరలో, కూతవేటు దూరంలో ఉన్న కర్ణాటకలోని యాదగిరి జిల్లా గుర్మిట్కల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా మల్లికార్జున్ ఖర్గే విజయం సాధించారని, మరోసారి చిత్తాపూర్ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారని, రెండు పర్యాయాలు గుల్బర్గా నియోజకవర్గం నుంచి లోక్‌సభ సభ్యుడిగా, ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పాడి పశుసంవర్ధక శాఖ, డెయిరీ, క్రీడలు, యువజన సర్వీసులు మరియు మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరికి మల్లికార్జున ఖర్గే గాడ్ ఫాదర్ లాంటివారని, రాజకీయంగా వాకిటి శ్రీహరి ఎదుగుదలకు మల్లికార్జున ఖర్గే గారు పూర్తి స్థాయిలో అండదండలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే రాబోవు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రాజప్ప గౌడ కృష్ణ మండల అధ్యక్షుడు, కట్ట సురేష్ కుమార్ గుప్తా మక్తల్ మాజీ ఉపసర్పంచ్, బి.గణేష్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఏ. రవికుమార్, గొల్లపల్లి నారాయణ ,కోళ్ల వెంకటేష్, గాయత్రి అనిల్ , బోయ వెంకటేష్, ఓబులేష్, జి.రవికుమార్, కల్లూరి గోవర్ధన్, నాగేష్, దండు రాము, వెంకట్ రాములు, పీర్ పాషా, మహమ్మద్ అఫ్రోజ్, బ్యాగరి సురేష్, వెంకటేష్, సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బడుగు, బలహీనవర్గాల బలంతోనే కాంగ్రెస్ గేలుపు

◆ కార్యకర్తలను విస్మరిస్తే గాంధీభవన్‌కి పాదయాత్ర చేస్తాం

◆ మున్సిపల్ మాజీ చైర్మన్ బి.ఎస్.కేశవ్

**గద్వాల టౌన్ జూలై 21, ప్రభాతవార్త:** గల్లి నుండి ఢిల్లీ దాకా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, గెలుపుకు బడుగు, బలహీన వర్గాలైన ఎస్సీ ఎస్టీ, బీసి మైనార్టీ ప్రజల మెజార్టీతో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిందని మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ అన్నారు. సోమవారం జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విస్తృత స్థాయి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బి ఎస్ కేశవ్ ,టిపిసిసి మెంబర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంజిపేట్ శంకర్ లు మాట్లాడుతూ... గద్వాలలోకాంగ్రెస్ కార్యకర్తలను విస్మరిస్తే గద్వాల నుండి గాంధీభవన్ దాకా పాదయాత్ర చేస్తామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు గద్వాలలో బలహీన పరిస్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీని బలోపేతం కోసం అధిష్టాన పిలుపు మేరకు ఇంచార్జి సరిత నేతృత్వంలో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశామని అన్నారు. సరిత తిరుపతయ్య నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరిగిందని,2023 అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో సరిత ఓటమి పాలయ్యారని గుర్తు చేశారు. కాని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని గంపెడు ఆశలతో ఉన్న పార్టీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఇక్కడ ఉన్నటువంటి బడుగు బలహీన వర్గాల కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పూర్తిగా విస్మరిచ్చిందన్నారు.. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పాటు అనంతరం పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు గాని సంక్షేమ ఫలాలు గాని ఏమాత్రం పొందడం లేదని అయినప్పటికీ ఎక్కడ నిరుత్సాహపడకుండా ఇంచార్జి సరిత నాయకత్వంలో ఇప్పటికి పార్టీ కోసం శ్రమిస్తూ పార్టీ పిలుపు మేరకు పని చేస్తున్నారని అన్నారు. గల్లి నుండి ఢిల్లీ దాక బడుగు బలహీనవర్గాల ప్రజలు రాజకీయంగా ఎదగాలని సంకల్పంతో 42 శాతం రిజర్వేషన్ బీసీల కల్పిస్తూ ఏఐసిసి అగ్రనేత పార్లమెంటు ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ముందుకు సాగుతున్న తరుణంలో అందుకు భిన్నంగా గద్వాల బీసీ నాయకత్వంపై అధిష్టానం పట్టి పట్టనట్లు వ్యవహరించడం, కాంగ్రెస్ పార్టీ గద్వాలలో ప్రతిష్ఠాత్మకంగా ఉండాలంటే స్థానిక సంస్థల ఎన్నికలలో సరితమ్మ వర్గీయులకే ఇందిరమ్మ కమిటీ , ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో పార్టీ కార్యకర్తలకు అవకాశం కల్పించాలని, కాంగ్రెస్ పార్టీలో సరితమ్మకు సముచిత స్థానం కల్పించాలని వేదికపై నుంచి కాంగ్రెస్ పార్టీ పెద్దలను కోరారు. గద్వాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమైన సమయంలో పార్టీని బలహీనపరచడానికి ప్రత్యర్థులు కుట్రలు పనుతున్నారని ఆరోపించారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారి కాకుండా దొడ్డిదారిన వచ్చిన నాయకులకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో భీఫామ్‌లు అందజేస్తే గద్వాల నుంచి గాంధీభవన్ కు పాదయాత్ర చేస్తామని హెచ్చిరించారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు మధుసూదన్ బాబు, బల్గేర నారాయణ రెడ్డి, మహ్మద్ ఇసాక్, మాచర్ల వరలక్ష్మి, వెంకటస్వామి గౌడ్, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, పెద్దపల్లి అల్వాల రాజశేఖర్ రెడ్డి, డిటిడిసి నర్సింహులు, భాస్కర్ యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, జనరల్ సెక్రటరీ యెస్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, పులిపాటివెంకటేష్, డి.ఆర్, శ్రీధర్, కోటేష్, వాకిటిసంజీవులు, యూసూఫ్, ఎస్.కృష్ణ, మహేష్, పార్వతీ, అడ్వకేట్ షాఫీవుల్లా, సురేష్, నాగరాజు, పాతపాలెం ఆనంద్ గౌడ్, మహానంది రెడ్డి, పటేల్ శ్రీనివాసులు, అరగిద్దబాలకృష్ణ, సీసాల వెంకట్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

## అంబట్‌పల్లిలో డ్రైనేజీలు లేక రోడ్లపై పారుతున్న నీరు

### స్వంత ఖర్చుతో శుభ్రం చేయించిన మాజీ ఉప సర్పంచ్ జనార్దన్

**లింగాల, జూలై 21 ప్రభాతవార్త:** డ్రైనేజీలు లేక రోడ్లపైనే నీరు పారుతుంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు అంబట్ పల్లి గ్రామంలోని 1వ వార్డులో డ్రైనేజీ లేక వర్షం నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. వార్డులో నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. అక్కడ పూర్తిగా డ్రైనేజీలు లేకపోవడం వల్ల రోడ్లపైన నీరు నిలిచిపోవడం చూసి గ్రామ మాజీ ఉప సర్పంచ్ జనార్దన్ తన స్వంత ఖర్చుతో తాత్కాలికంగా నీరు పోయే విధంగా కాలువను ఏర్పాటు చేయించారు. ఆ వార్డులో కొంత సమస్య ఉండడంతో పోలీసుల సహకారంతో ఏలాంటి సమస్య రాకుండా పరిష్కారం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.



అంబట్‌పల్లిలో డ్రైనేజీలు లేక రోడ్లపైనే నీరు



తాత్కాలికంగా వర్షపు నీరు వెళ్లడానికి దారి ఏర్పరుస్తున్న దృశ్యం

# మురికివాడల గోడు పట్టదా..?

◆ ఏళ్లుగా అసంపూర్తిగానే రోడ్డు విస్తరణ పనులు!

◆ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఇలాఖాలో క్రీడాకారులు ఇబ్బందులు పడటం బాధాకరం

◆ టౌన్ హాల్, కూరగాయల మార్కెట్, ఇండోర్ స్టేడియాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలి

◆ బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్



గుంతల మయమైన రోడ్డును పరిశీలిస్తున్న రాచాల

**వనపర్తి, జూలై21 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో నెలకొన్న పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం వనపర్తి పట్టణంలో భారీగాతరలివచ్చిన స్థానికప్రజలతో కలిసి చింతల ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాతబజార్‌లోని కాళికాంబ ఆలయాన్ని దర్శించుకుని జమ్మిచెట్టు నుంచిగాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, రాజీవ్‌చౌక్, వివేకానంద చౌరస్తా మీదుగా హాకీ అకాడమీ వరకు సమస్యలు తెలుసుకుంటూ ఉత్సాహంగా వాకింగ్ చేశారు ఈ సందర్భంగా రాచాల మీడియాతో మాట్లాడుతూ ఏళ్లుగా అసంపూర్తిగానే రోడ్ల విస్తరణ ప్రక్రియ సాగడం సిగ్గుచేటని, రోడ్ల విస్తరణ పనులు వెంటనే పూర్తి చేసి బాధితులను ఆదుకోవాలన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన టౌన్ హాల్, కందకం యందు నిర్మించిన కూరగాయల మార్కెట్‌సముదాయాన్ని, ఇండోర్ స్టేడియాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలన్నారు. గాంధీ చౌకులో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. టౌన్ పోలీస్ స్టేషన్ ముందు తవ్విన రోడ్డును వెంటనే పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాత బస్టాండును త్వరితగతిన నిర్మించి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని ఆర్టీసీ అధికారులను కోరారు. హాకీ అకాడమీలో క్రీడాకారులకు సరైన వసతులు లేవని, గత ఐదేళ్లుగా ఒక్కహాకీస్టిక్ కూడా ఇవ్వలేదని క్రీడాకారులు రాచాల దృష్టికి తీసుకురాగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఇదే జిల్లాకు చెందిన నాయకుడని, తన స్వంత నియోజకవర్గంలో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కోవడం బాధాకరమని, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ప్రతీ కాలనీకి సీసీరోడ్లు, శివారు కాలనీల వరకు నల్లా కనెక్షన్లు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో బీసీ బాలుర కళాశాల వసతి గృహం మంజూరు చేసి రూ.1.5 కోట్లు నిధులు కేటాయించారు కానీ స్థలం కేటాయించలేదు. వెంటనే స్థలం కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ పట్టణ అభివృద్ధిపై ఎప్పటికప్పుడుఅధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యలపై ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, వచ్చే స్థానిక, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టి వారిని గెలిపించుకుంటామన్నారు. మార్నింగ్‌వాక్ కార్యక్రమానికి స్వతంత్రఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్, వహీద్, రమేష్ సాగర్ తదితర యువ నాయకులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపిపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రాష్ట్ర కార్యదర్శి వివిగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు గూడుషా, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, మదనాపూర్ మండల కన్వీనర్ నరసింహయాదవ్, ప్రసాద్ గౌడ్, నాగరాజు, నరేందర్ సాగర్, యశ్వంత్ గౌడ్ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో మెజారిటీ సీట్లు గెలుస్తాం

■ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై21 ప్రభాతవార్త:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జిల్లాలో మెజార్టీ సీట్లు గెలవడం కోసం కార్యకర్తలు సన్నద్ధం కావాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం భారతీయ జనతా పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల బీజేపీ జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు అధ్యక్షతన కొల్లాపూర్ క్రాస్ రోడ్‌లోని జెఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. జిల్లా కార్యాశాలకుముఖ్యఅతిథిగా హాజరైన చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ ఎంపీటీసీ, జెడ్పిటిసి స్థానాలను గెలవడం కోసం కార్యాచరణ రూపొందించి నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్యన ఉండి పనిచేయాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ద్వారానే తెలంగాణలోని గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమైందని ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యాలపై ఇంటింటి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం



సమావేశానికి హాజరైన బీజేపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

జిల్లా ఎన్నికల ప్రభారీ బొక్కా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి బూత్‌లో 51 శాతం ఓట్లు సాధించడానికి కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. భవిష్యత్తులో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు గెలవాలంటే స్థానిక సంస్థల ఎన్నికలే కీలకమన్నారు. వెంటనే మండల ఎన్నికల కార్యశాలలు నిర్వహించి కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేసి గ్రామాల్లో గెలిచి బిజెపి జెండా ఎగరేయాలన్నారు. కార్యశాల అతిథులు మాజీ ఎంపిపోతుగంటి రాములు, జాతీయ బీసీకమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారిలు మాట్లాడుతూ అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ స్థానిక ఎన్నికల్లో గెలిచే అవకాశం లేదన్నారు. కార్యకర్తలు కష్టపడి పని చేస్తే గెలుపు మనదే అని కార్యకర్తల్లో భరోసా నింపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల ఇంచార్జ్ ఎల్లేని సుధాకర్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి, పోతుగంటి భరత్‌ప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధులు నెడనూరి దిలీప్ చారి, సోలంకి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుసిరెడ్డి సుబ్బారెడ్డి, మంగ్యా నాయక్, రాష్ట్ర జిల్లా కౌన్సిల్ నెంబర్లు, జిల్లా పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్

■ అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

■ కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం

**మహబూబ్‌నగర్, జూలై21 ప్రభాతవార్త:** వర్షాకాలంలో అధిక వర్షాలవలన ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు రావడానికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24/7 కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. వర్షాల వలన జిల్లా ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా కంట్రోల్ రూం నంబర్ 08542 241165కు ఫోన్ చేసి తెలుపవచ్చని కలెక్టర్ ఈ ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూంకు వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు.

## ఆంజనేయస్వామి ఆలయంపై నిలిచిన వర్షపు నీరు

నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజల విజ్ఞప్తి



ఆలయంపై వర్షపు నీరు నిలిచిన దృశ్యం

**రాజాపూర్, జూలై21 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రంలోని శ్రీ శివ సీతారామాంజనేయ స్వామి ఆలయంపై వర్షపు నీరు నిలుస్తోందని, ఆలయంపై వర్షపు నీరు నిలవకుండా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఆలయానికి సంబంధించిన బోరునుసైతం ఇతరులు వాడుకుంటున్నారని, ఆలయ బోరు నీరును వేరే వ్యక్తులకు ఇవ్వకుండా చూడాలని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బుగ్గయ్య సోషల్ మీడియా వేదికగా ఆలయ నిర్వాహకులకు, గ్రామ పెద్దలకు విజ్ఞప్తి చేశారు.

## లింగంపేట దర్గాకు వెలుగులు

- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి గ్రామస్తుల కృతజ్ఞతలు

**జడ్చర్ల, జూలై21, ప్రభాతవార్త:** జడ్చర్ల మండలంలోని లింగంపేట్ గ్రామంలోని దర్గాలో కరెంటు సౌకర్యం లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గ్రామస్తులు ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యేతో ఫోన్ ద్వారా మాట్లాడి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే సూచనతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, తక్కువ సమయంలో దర్గాకుకరెంటు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా లింగంపేట గ్రామస్తులు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి, అలాగే విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల పట్ల నిబద్ధత చూపించిన ప్రజా ప్రతినిధులకు గ్రామస్థులు అభినందనలు తెలియజేశారు.

## తహసీల్దార్లకు ఉపాధ్యాయ సంఘాలు మెమొరాండం

ఆగస్టు 23న హైదరాబాదులో రాష్ట్రస్థాయి మహాధర్నా



**ఇటిక్యాల, జూలై21 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకుగాను ఉపాధ్యాయుల సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రాలలో ఈనెల 23.24 తేదీలలో తాహసిల్దార్లకు మెమొరాండం ఇచ్చేందుకు ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశలవారీగా చేపట్టే ధర్నాలపై సమావేశమై చేపట్టే కార్యక్రమాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యాయుల సంఘం పోరాటకమిటీ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23,24 తేదీలలో తహసిల్దార్లకు మెమోరాండం ఇచ్చి వారి ద్వారా ముఖ్యమంత్రికి పంపనున్నట్లు అలాగే ఆగస్టు 1న జిల్లా కేంద్రాలలో ధర్నా. ఆగస్టు 23న హైదరాబాదులో రాష్ట్రస్థాయి మహా ధర్నా నిర్వహించనున్నట్లు వారు వివరించారు. పిఆర్సి నివేదికను తెప్పించుకొని ప్రభుత్వం జూలై 2023 నుండి పిఆర్సిని అమలు చేయాలని. బదిలీలు పదోన్నతుల ప్రక్రియను ఈ నెలాఖరులో చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ ను రద్దుచేసి ఓపీఎస్ ను అమలు చేయాలని ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో నెంబర్ 25ను సవరించాలని 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ఉద్యోగ విరమణపొందిన ఉపాధ్యాయులకు పెన్షనరీ బెనిఫిట్స్‌ను విడుదల చేయాలని సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు 29రోజుల సమ్మె కాలానికి పూర్తి వేతనం చెల్లించి టైం స్కేలును ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమంలో ప్రభుత్వం ముందు దాదాపు 25 డిమాండ్లను పెడుతున్నట్లు ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. 23, 24 తేదీలలో చేపట్టే కార్యక్రమంలో భాగంగా తహసిల్దార్లకు ఉపాధ్యాయులు మెమోరాండం ఇవ్వాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సంఘం నాయకులు గోపాల్, ప్రభాకర్ శాస్త్రి, ఉదయ్ కిరణ్, హనుమంతు, చంద్రకాంత్, లోకేష్, హరిబాబు, శంకర ప్రభాకర్ పాల్గొన్నారు.

## రాజుల సొమ్ము... రాళ్ళ పాలు

(మొదటి పేజీ తరువాయి)

దుర్వినియోగం పాలైన నిధులను వారం రోజులలో రికవరీ చేయాలని హెచ్చరించారని, నిధులు డ్రా చేసిన వ్యక్తుల నుండి రికవరీ చేయకపోవడంతో కోనేటిపూర్‌నుండి ఉమ్మాపూర్ గ్రామానికి బదిలీ చేశారని సదరు పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పనుల నిమిత్తం మంజూరు చేసిన ట్రాక్టర్ గత రెండు సంవత్సరాలుగా మరమ్మతుకు నోచుకున్న సంబంధి త అధికారులు పట్టించుకోకుండా మరమ్మతులు చేయించకపోవడంతో ఓ వ్యవసాయ పొలంలో వృధాగా పడి ఉంది. గ్రామ పంచాయతీలను అభివృద్ధిపరిచి గ్రామంలో ఉన్న ప్రజలకు పనులు కల్పించి వారి జీవనోపాధి పెంచాలని ప్రభుత్వం కృషి చేస్తుంటే...క్రింది స్థాయిలో పనిచేస్తున్న ప్రభుత్వ సిబ్బంది మాత్రం వారు నిర్వహించే ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోవడంతో ప్రభుత్వ ఖజానా పక్కదారి మళ్లించి అక్రమార్కులకు ఆసరాగా నిలుస్తుందని చెప్పకనే చెప్పుకోవచ్చు. ఇంత జరుగుతున్న కోనేటిపూర్ గ్రామ పంచాయతీపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

## రైతులకు సకాలంలో విత్తనాలు, యూరియా అందుబాటులో ఉంచాలి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులతో మాట్లాడుతూ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన సూచనలను జిల్లా స్థాయిలో అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 25వ తేదీనుండి ఆగస్టు 10వ తేదీ వరకు అన్ని నియోజక వర్గస్థాయిలోని మండలాల్లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజన ప్రజలకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించి మందులు సరఫరా వైద్య సేవల విషయంలో తగు జాగ్రత్తలు చేపట్టాలని ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ డీఎంహెచ్ఓను ఆదేశించారు. జిల్లాలోని చెరువులు సాగునీటి కుంటలు ప్రమాదకర స్థాయిలో ఉంటే నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధికవర్షాలు కురిసే ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేసేలా అధికారులు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వర్షం కారణంగా సమస్యలు తలెత్తే ప్రాంతాల నుంచి ఫిర్యాదు వచ్చినప్పుడు వెంటనే స్పందించి తగిన సహాయకచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కురుస్తున్న వర్షం నేపథ్యంలో వాటర్‌వర్క్స్, విద్యుత్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, డిపిఓ లక్ష్మయ్య, వైద్య విధాన పరిషత్ రామకృష్ణ, నీటిపారుదల ఈఈలు, తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో బోనాల పండుగ ఉత్సవాలు



బోనాల పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థినిలు

**మక్తల్ టౌన్, జులై 21 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలోని శిశు మందిర్ పాఠశాలలో బోనాల పండుగ విద్యార్థినీలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరు సాంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనం పెట్టుకొని పాఠశాల ఆవరణంలో బోనాల పండుగ పాటలతో కొలాహలంగా జరిగింది. విద్యార్థులు పోతురాజు వేషధారణ ధరించి చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు కుర్మయ్య, ఉప ప్రదనాచార్య శాంతాబాయి, పాఠశాల సిబ్బంది సరిత, సురేష్, శ్రీనివాస్, గోపాల్ రెడ్డి విద్యార్థులల తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

*బిఆర్ఎస్ నుండి నాయకులు వెళ్లిపోయారేమో గానీ*

## కార్యకర్తలు ఒక్కరూ కూడా వెళ్లిపోలేదు

◆ మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**ఊట్కూర్, జూలై21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తా దగ్గర ఉన్న బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశంలో భాగంగా మక్తల్‌మాజీ శాసనసభ సభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నుండి నాయకులు వెళ్లిపోయారేమోగానీ కార్యకర్తలు మాత్రంఒక్కరు కూడా వెళ్లిపోలేదు అని మాట్లాడుతు ప్రతి కార్యకర్తను ఒక నాయకుడిని చేస్తానని హామీ ఇచ్చి, కార్యకర్తల్లో మనో ధైర్యాన్ని నింపారని అన్నారు. అలాగే ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల గురించి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేయడం జరిగింది కానీ తులం బంగారం ఏది అని కాంగ్రెస్ పార్టీని దుయ్యబట్టారు. అలాగే సన్నరకం వడ్లు వేసిన ప్రతి రైతుకు క్వింటాల్‌కు 500 బోనస్ ఇస్తానని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదని మాట్లాడుతూ కొడంగల్ ఎత్తిపోతలపథకంలో భాగంగా ఎకరానికి 20 లక్షలు ఇస్తానని నమ్మించి, ఇప్పుడు మాత్రం 14 లక్షలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీమోసపూరితమాటలకు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలోబిఆర్ఎస్‌ముఖ్యమైననాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాకు చిక్కిన బైక్

పొరపాటుగా తీసుకపోయిన మోటార్ సైకిల్‌ను పట్టించిన సీసీ కెమెరాలు



బైకు పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అందజేస్తున్న ఎస్ఐపి

**ఖిల్లాగణపురం జూలై21 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మానసిపేట గ్రామానికి చెందిన పరిగెల నవీన్ కుమార్ సోమవారం మధ్యాహ్నం ఘనపురం బేకరీ దగ్గర తన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను అక్కడ ఉంచి కొద్దిసేపటి తర్వాత బైక్ నిలిపిన దగ్గరికి వెళ్లి చూడగా కనిపించలేదు వెంటనే పోలీస్ స్టేషన్‌కి వెళ్లి విషయం చెప్పగా ఎస్ఐపి ఆదేశాల మేరకు కానిస్టేబుల్ లింగం జరిగిన స్థలం దగ్గరికి వెళ్లి సీసీ కెమెరాలు తనిఖీ చేసి చూడగా అట్టి బైకును మహమ్మద్ హుస్సేన్ పల్లికి చెందిన వ్యక్తి తన బైక్ అనుకొని పొరపాటుగా నవీన్ బైకును తీసుకు వెళ్లాడు. విషయం తెలుపగా తన బైకులు అక్కడే వదిలి పెట్టానని బేకరీ వద్దకు వెళ్లగా అతని బైక్ అక్కడే ఉంది దీంతో బైక్ను నవీన్‌కు అప్పగించారు. సీసీ కెమెరాలు ఉండటంవల్ల అనేక చోరీ కేసులకు సంబంధించిన సమాచారం వెంటనే తెలుసుకోగలుగుతున్నామని ఎస్ఐ తెలిపారు బైకు తిరిగి తనకు అప్పగించినందుకు నవీన్ పోలీస్ వారికి ధన్యవాదాలు తెలిపారు.